మల్లు స్వరాజ్యం.. హక్కుల గొంతుక

- పోరాట యోధ...ప్రజా పక్షపాతి
- వర్ధంతి సభలో వక్తలు
- మెడికల్ క్యాంపు ప్రారంభించిన శాంతా సిన్హా

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

'మల్లు స్వరాజ్యం ఉద్యమ కారిణే కాదు..గొప్ప మానవతా వాది. మహిళా హక్కుల కోసం జీవితాంతం పోరాడారు. ఆమె చాలా ధైర్యవంతురాలు' అని జాతీయ బాలల హక్కుల కమిషన్ మాజీ చైర్‌పర్సన్ డాక్టర్ శాంత సిన్హా అన్నారు. ఐద్వా రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మల్లు స్వరాజ్యం రెండో వర్ధంతి సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లోని వీరనారి ఐలమ్మ భవన్‌లో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపును శాంతాసిన్హా ప్రారంభించారు. అనంతరం స్వరాజ్యం చిత్ర పటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఐద్వా అధ్యక్షురాలు ఆర్ అరుణజ్యోతి అధ్యక్షతన జరిగిన సభలో శాంతాసిన్హా మాట్లాడుతూ మల్లు స్వరాజ్యం నిరంతరం ప్రజల, ముఖ్యంగా మహిళల బాధలగురించి ఆలోచించారని తెలిపారు. పూర్తి జీవితం ప్రజల పక్షాన నిలబడి పోరాడిన ధీరవనిత ఆమె అని చెప్పారు. అలాంటి వ్యక్తులు అరుదుగా ఉంటారన్నారు. ఇప్పటికీ ఆమె గురించి జనం కథలు కథలుగా చెప్పుకోవటం విశేషమన్నారు. సమాజ హితం కోసం ఆమె జీవితాన్ని త్యాగం చేశారని చెప్పారు. చదువుతోనే జ్ఞానం వస్తుందని, దానితో స్వయ రక్షణకు పాటు పడ్డారని నమ్మటమంటే ఆడపిల్లల భద్రత గురించి ఎంతగా పరితపించారో అర్థమవుతుందన్నారు. ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి మాట్లాడుతూ భూస్వామ్య వ్యవస్థను అంతమొందించాలనీ, వెట్టి చాకిరి, దోపిడీ, పీడనకు వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో మల్లు స్వరాజ్యం ముఖ్య భూమిక పోషించిందని గుర్తు చేశారు. పురుషులతో పాటు స్త్రీలకు సమాన హక్కులు కావాలని పోరాటం చేసిందని చెప్పారు. సమసమాజ నిర్మాణం కోసం ఆమె పోరాడిన తీరు, తెగువ నేటి తరానికి స్పూర్తిదాయకమన్నారు. అసహన రాజకీయాలు, అప్రజాస్వామిక నిర్ణయాలు, హక్కులపై దాడులు జరుగుతున్న నేటి తరుణంలో పోరాట యోధులను యాది చేసుకోవటం అవసరమన్నారు. మహిళలపై దాడులు, దౌర్జన్యాలు, లైంగిక వేధింపులు విచ్చలవిడిగా జరుగుతున్న పరిస్థితుల్లో మహిళలకు, బాలికలకు ఆత్మరక్షణ శిబిరాలు నిర్వహించడానికి ఆమె ఎప్పుడూ కృషి చేసేవారని గుర్తు చేశారు. స్వయం రక్షణకోసం కరాటే లాంటి శిక్షణలు ఇవ్వటం అవసరమని నిరంతర పరితపించారని తెలిపారు. కుల, మత, పురుషాధిపత్యానికి వ్యతిరేకంగా చివరికంటూ పోరాడారని చెప్పారు. కుటుంబాలను సర్వనాశనం చేస్తున్న 'సారా' కు వ్యతిరేకంగా సాగిన ఉద్యమంలోనూ ఆమె పాత్ర మరువలేనిదన్నారు. తుపాకీ తూటాలాంటి తన మాటలతో ప్రజలను ఉద్యమాల వైపు నడిపించారన్నారు. ముక్కుసూటిగా మర్మం లేని మాటలతో తప్పులపై విమర్శనాస్త్రాలను సంధించేవారని గుర్తు చేశారు. ఐద్వా ఉపాధ్యక్షులు ఇందిరా, కెఎన్ ఆశాలత, ట్రస్ట్ చైర్‌పర్సన్ బుగ్గవీటి సరళ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన ప్రజలకు ఆమె మాటలే కొండంత ధైర్యాన్ని ఇచ్చేవన్నారు. ఎక్కడ ప్రజా ఉద్యమాలు ఉంటే అక్కడ ఉండేదని గుర్తు చేశారు. పేద ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. మహిళా సాధికారత కావాలనీ, రైతు రాజ్యం రావాలని ఆసుపత్రిలో చివరి క్షణాల్లో ఉన్నప్పుడు సైతం పిడికిలి బిగించి నినదించారని గుర్తు చేశారు. అనంతరం వీరనారి ఐలమ్మ ట్రస్టు నిర్వహిస్తున్న కరాటే శిక్షణ పాఠశాలలో ప్రతిభను ప్రదర్శించిన పది మంది విద్యార్థులకు గ్రీన్ బెల్టు, ఎల్లో బెల్టులను శాంత సిన్హా, ట్రస్ట్ చైర్‌పర్సన్ బుగ్గ వీటి సరళ అందజేశారు. కరాటే మాస్టారు సుబ్రహ్మణ్యంతో పాటు విద్యార్థులను వారు సన్మానించారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి పి శశికళ, రాష్ట్ర నాయకులు ఎ పద్మ, ఎండి షబానా బేగం, విజయమ్మ, మస్తాన్ బి, ఎం స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు. వాసవి కంటి ఆస్పత్రి, కోరంటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు, నర్సులు ల్యాబ్ టెక్నీషియన్లు డాక్టర్ దీప్తి టీం ఆ ప్రాంత ప్రజలకు వైద్య సేవలందించారు.



వేసవి తాగునీటి అవసరాలకు ఇబ్బంది లేదు

- సిఎస్ శాంతికుమారి

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని రిజర్వాయర్లలో సరిపడా నీరు ఉన్న నేపథ్యంలో ప్రస్తుత వేసవికాలంలో తాగునీటి అవసరాలకు ఎలాంటి ఇబ్బందులు లేవని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి స్పష్టం చేశారు. రాష్ట్రంలో తాగునీటి సరఫరా పరిస్థితులపై సంబంధిత శాఖల అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్, పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, పంచాయతీ రాజ్ కమీషనర్ అనిత రామచంద్రన్, జిహెచ్ఎంసి కమీషనర్ రోనాల్డ్‌రోస్, మున్సిపల్ శాఖ డైరెక్టర్ దివ్య, మిషన్ భగీరథ ఈఎన్సీ కృపాకర్‌రెడ్డి తదితర అధికారులు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ యుద్ధ ప్రాతిపదికన మరమత్తులు చేపట్టి తాగునీటి సరఫరాను నిర్విరామంగా కొనసాగించాలని ఆదేశించారు. గ్రేటర్ హైదరాబాద్‌లోనూ సరిపడా నీటిని అందిస్తున్నామని, ఎక్కడైనా అదనపు వాటర్ ట్యాంకులు కోరితే వాటిని కూడా అందిస్తున్నామని స్పష్టం చేశారు. మంచినీటి సరఫరా విషయంలో ఏవిధమైన ఆందోళనలు అవసరం లేదని వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని అన్ని రిజర్వాయర్లలో నీటి లభ్యత, వేసవికాలంలో తాగునీటి సరఫరాకు తీసుకున్న చర్యలపై సంబంధిత శాఖల కార్యదర్శులతో సమీక్షించారు.

మే 8 నుంచి ఎప్‌సెట్ !

- 11 వరకు నిర్వహణ

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎప్‌సెట్ (ఎంసెట్) రాతపరీక్షల షెడ్యూల్‌ను మార్చాలని ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. మే తొమ్మిది నుంచి 12 వరకు ఎప్‌సెట్ రాతపరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తామని ఉన్నత విద్యామండలి తొలుత ప్రకటించింది. అయితే ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో ఎప్‌సెట్ పరీక్షల తేదీల్లో మార్పులు చేయాలని భావిస్తున్నది. మే ఎనిమిది నుంచి 11వ తేదీ వరకు ఎప్‌సెట్ రాతపరీక్షలను నిర్వహించాలని సూచనప్రాయంగా నిర్ణయించినట్టు తెలిసింది. ఆ సెట్ కమిటీ సమావేశాన్ని నిర్వహించి పరీక్షల తేదీలను ఖరారు చేసే అవకాశమున్నది. మే ఎనిమిది, తొమ్మిది తేదీల్లో ఇంజినీరింగ్ రాతపరీక్షలు, పది, 11 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం రాతపరీక్షలను నిర్వహించనుంది. ఈ దిశగా ఉన్నత విద్యామండలి అధికారులు కసరత్తు చేస్తున్నట్టు తెలిసింది.



పంట పొలాలను పరిశీలిస్తున్న మాజీ ఎంపి బోయినపల్లి వినోద్‌కుమార్

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

- మాజీ ఎంపి బోయినపల్లి వినోద్‌కుమార్

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

అకాల వర్షంతో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించి ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎంపి బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ముస్తాబాద్ మండలంలోని పోతుగల్, గన్నెవారిపల్లె, సేవాలాల్ తండా గ్రామాల్లో పర్యటించి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. వ్యవసాయ అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం వెంటనే నష్టపోయిన రైతులందరికీ నష్టపరిహారం చెల్లించాలన్నారు. ముస్తాబాద్‌లో సోమవారం రాత్రి కురిసిన వర్షానికి భారీ చెట్టు విరిగి విద్యుత్ స్తంభంపై పడటంతో మృతిచెందిన ఎల్లసాని ఎల్లయ్య కుంటుమాన్ని పరామర్శించారు. వినోద్‌కుమార్ వెంట ఎంపిపి శరత్‌రావు, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు గోపాలరావు, విద్యుత్ సహకార సంఘం డైరెక్టర్ అంజి రెడ్డి, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు సురేందర్‌రావు, పట్టణ అధ్యక్షుడు నరసింహారెడ్డి, నాయకులు సర్వర్ పాషా ఉన్నారు.

ఏప్రిల్ మూడో వారంలో ఇంటర్ ఫలితాలు!

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు ముగిశాయి. గతనెల 28న ఇంటర్ పరీక్షలు ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈనెల 14 వరకు ప్రధాన పరీక్షలు జరిగాయి. చివరి రోజు మంగళవారం ఇంటర్ సెకండియర్ విద్యార్థులకు మోడ్రన్ లాంగ్వేజ్ పేపర్–2, జాగ్రఫీ పేపర్–2 పరీక్షలను నిర్వహించామని ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు 299 మంది దరఖాస్తు చేయగా, 295 (98.7 శాతం) మంది విద్యార్థులు హాజరయ్యారని వివరించారు. నలుగురు (1.3 శాతం) మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. ఇంటర్ సెకండియర్ విద్యార్థులకు మోడ్రన్ లాంగ్వేజ్ పేపర్–2, జాగ్రఫీ పేపర్–2 పరీక్షలకు సెట్ బి ప్రశ్నాపత్రాన్ని ఎంపిక చేశామని వివరించారు. ఈ పరీక్ష ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా జరిగిందని తెలిపారు. ఈ పరీక్షలకు సహకరించిన విద్యాశాఖ అధికారులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, జిల్లా కలెక్టర్లు, రెవెన్యూ, పోలీసు, తపాలా, ఆర్టీసీ, వైద్యారోగ్యం, విద్యుత్, బిఎస్ఎన్ఎల్, ఇతర అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. వచ్చేనెల మూడో వారంలో ఇంటర్ ఫలితాలు విడుదలయ్యే అవకాశముంది. ఈ దిశగా ఇంటర్ బోర్డు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈనెల నాలుగో తేదీ నుంచి ఇంటర్ జవాబు పత్రాల మూల్యాంకనం ప్రక్రియ ప్రారంభమైన విషయం రాష్ట్రవ్యాప్తంగా 16 కేంద్రాల్లో ఈనెల 25 వరకు ఆ ప్రక్రియ కొనసాగుతుంది.

అదనపు కలెక్టర్ ఇంట్లో చోరీ

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

ములుగు జిల్లా ఏటూరు నాగారం మండల కేంద్రంలోగల అదనపు కలెక్టర్ నూతి మధుసూదన్ సొంత ఇంట్లో సోమవారం రాత్రి దొంగలు తాళాన్ని పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. అయితే మధుసూదన్ హైదరాబాదులో అదనపు కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఏటూరు నాగారం తన సొంత గ్రామం కావడంతో ఇక్కడ నివాసాన్ని ఏర్పాటు చేసుకున్నారు. అప్పుడప్పుడు కుటుంబ సమేతంగా వచ్చి పోతుంటారు. ఈ క్రమంలో రాత్రి దొంగలు చోరీకి పాల్పడిన విషయాన్ని బంధువులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఫోరెన్సిక్ అధికారులు, స్థానిక సిఐ రాజు, ఎస్ఐ కృష్ణ ప్రసాద్ సంఘటన స్థలానికి చేరుకొని ఆధారాలను పరిశీలించారు. వేలిముద్రలను సేకరించడం తోపాటు ఇంట్లో ఉన్న సిసి కెమెరాల పుటేజీలను పరిశీలించగా.. ఇద్దరు వ్యక్తులు ముసుగుపెట్టుకొని లోపలికి చొరవబడి పై అంతస్తులోకెళ్లడం కనిపించింది. బెడ్ రూమ్‌లోని బీరువాలను తెరిచి సామాను చిందరవందర చేశారు. అనుమానితుల కోసం చుట్టూ పక్కల వారిని పోలీసులు ఆరా తీశారు. అంతేకాకుండా ప్రధాన రోడ్డు వెంట సిసి కెమెరాల పుటేజీలను సేకరిస్తున్నారు. గతంలో ఆకులవారి ఘణపురంలో నాగేశ్వర్‌రావు ఇంట్లో సైతం ఇదే తరహాలో చొరబడి రూ. మూడు లక్షల వరకు సొత్తు, నగదు అపహరించుకుపోయారు. ఇప్పటి వరకు దొంగలు చిక్కలేదు.



పరిశీలిస్తున్న పోలీసులు

రాష్ట్రంలో వచ్చే రెండ్రోజులు వర్షాలు

- తేలికపాటి నుంచి మోస్తరు వానలు పడే అవకాశం

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో వచ్చే రెండ్రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఆదిలాబాద్, కొమ్రంభీమ్ అసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన వానలు పడొచ్చని పేర్కొంది. ఈ మేరకు ఆ జిల్లాలకు పసుపురంగు హెచ్చరికను జారీ చేసింది. హైదరాబాద్‌లోనూ రాబోయే 48 గంటల పాటు ఎక్కువ ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఆగ్నేయం దిశ నుంచి ఉపరితల గాలులు వీచే అవకాశముంది. అక్కడక్కడా తేలికపాటి వర్షం, చిరుజల్లులు పడే సూచనలున్నాయి. మంగళవారం ఉదయం ఉదయం 8:30 నుంచి రాత్రి 8:30 వరకు 43 ప్రాంతాల్లో వర్షం కురిసింది. బజార్ హత్నూర్‌లో అత్యధికంగా 2.95 సెంటీమీటర్ల వర్షం పడింది. ఆదిలాబాద్, కొమ్రంభీం అసిఫాబాద్, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, సంగారెడ్డి, జయశంకర్ భూపాలపల్లి, జనగాం జిల్లాల్లో వానపడింది.

అలరించిన పౌరాణిక నాటకం

ప్రజాశక్తి – కల్చరల్

తిరుపతి వేంకట కవులు రచించిన పాండవోద్యోగ విజయాలులో శ్రీ కృష్ణరాయబారం ఘట్టంలోని బావా ఎపుడు వచ్చితీవు, జెండా పై కపిరాజు, అలిగుటయే ఎరుంగనీ వంట పద్యాలు నాడు తెలుగు వారి నాలుకలపై కదలాడేవి. ఆ పద్యాలను గుర్తు చేస్తూ శివాని ఆర్ట్స్ అసోసియేషన్, వైఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదికపై శ్రీ కృష్ణ రాయబారంతో పాటు కళా రాజ్యం నాటక సంస్థచే రామ భక్త హనుమాన్ నాటకమూ ప్రదర్శించారు..ఈ నాటకంలో ఆంజనేయుడుగా మున్నంగి జగన్ గరుత్మంతుడు సాల్వా చారి, నారదుడుగా గాబ్రిల్, సత్యభామగా సాయి లక్ష్మి నవరస నటన ప్రదర్శించారు. కృష్ణ రాయబారం నాటకంలో.కృష్ణునిగా మున్నంగి దయాకర్, దుర్యోధనునిగా సాంబశివ రెడ్డి పాటా పోటీగా పద్య రాగాలాపనతో ప్రేక్షకుల ప్రశంస పొందారు ఇతర పాత్రల్లో మల్లాది వెంకట రమణ, శ్రీ రామ్, మంగపతి తదితరులు నటించారు.తెలంగాణ ప్రాచీన కళా రూపం చెన్నయ్య, పుల్లయ్యల బృందం చిందు యక్షగానం ప్రదర్శించారు. అనంతరం జరిగిన సభలో తెలంగణ మూవీ టివి డిజిటల్ ఆర్టిస్ట్ యూనియన్ నటుడు పృథ్వీ రాజ్ ప్యానల్‌లో గెలుపొందిన నూకరాజు, రామమోహన్, కుటుంబ శర్మ, పద్మరేఖ తదితరులను సత్కరించారు. సంస్థ స్థాపకుడు పరమేశ్వర్ శివ జంగయ్య గౌడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఆ నిందితులను తక్షణమే అరెస్టు చేయాలి

- ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ చైర్మన్ ఆదేశాలు
- నిందితులను కఠినంగా శిక్షించాలి – ప్రజాసంఘాలు

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

గిరిజన ట్రాన్స్ యువతి మెడలో చెప్పుల దండేసి, గుండు గీసిన నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని రాచ కొండ పోలీసులను రాష్ర ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మంగళవారం ఆదేశించారు. హయత్ నగర్‌కు చెందిన రమావత్ సౌమ్యను ఫోన్ చేసి, చౌటుప్పల్‌కు పిలిపించుకుని కారులో నల్గొండకు కిడ్నాప్ చెసి నిందితులు తీవ్రంగా కొట్టారని తెలంగాణ ట్రాన్స్ జెండర్ పీపుల్స్ అసోసియేషన్ వ్యవస్థాపకులు కెఎంవి మోనాలిసా, డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన, ట్రాన్స్ జెండర్ నేత కొకిల, బాధిత యువతి సౌమ్య తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ కార్యాలయంలో కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను వారు కలిశారు. తమ గ్రూప్‌లోనే ఉండాలని నందిని ముఠా కిడ్నాప్ చెసి, నల్లగొండలో బంధించి మెడలో చెప్పుల దండేసి గుండు గీయించి అవమానపరిచారని వివరించారు. ఈ సంఘటనపై చౌటుప్పల్ పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. అయినా కేవలం ఐపిసి సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసి పది రోజులైనా నిందితులను అరెస్టు చెయలేదని చైర్మెన్‌కు వివరించారు. దీంతో నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని కమిషన్ చైర్మన్ అదేశించారు.

ఏప్రిల్ 3 నుంచి టెన్త్ స్పాట్ వాల్యుయేషన్

- 19 కేంద్రాల్లో 11 వరకు నిర్వహణ
- షెడ్యూల్ విడుదల

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

పదో తరగతి వార్షిక పరీక్షలకు సంబంధించిన జవాబుపత్రాల మూల్యాంకనం (స్పాట్ వాల్యుయేషన్) ప్రక్రియ వచ్చేనెల మూడో తేదీ నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ కృష్ణారావు మంగళవారం షెడ్యూల్‌ను విడుదల చేశారు. పదో తరగతి వార్షిక పరీక్షలు సోమవారం ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈనెల 30 వరకు ప్రధాన పరీక్షలు, వచ్చేనెల ఒకటి, రెండు తేదీల్లో ఓఎస్ఎస్‌సీ మెయిన్ లాంగ్వేజ్ పేపర్–1, పేపర్–2తోపాటు ఒకేషనల్ పరీక్షలు జరుగుతాయని ఈ సందర్భంగా సంచాలకులు పేర్కొన్నారు. వచ్చేనెల మూడు నుంచి 11 వరకు తొమ్మిది రోజులపాటు టెన్త్ మూల్యాంకనం ప్రక్రియ జరుగుతుందని వివరించారు. 18 జిల్లాల్లో 19 మూల్యాంకన కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. హైదరాబాద్‌లో రెండు స్పాట్ వాల్యుయేషన్ కేంద్రాలున్నాయని పేర్కొన్నారు. మే మొదటి వారంలో పదో తరగతి ఫలితాలను విడుదల చేయాలని అధికారులు భావిస్తున్నారు.ంపదో తరగతి వార్షిక పరీక్షల్లో భాగంగా మంగళవారం రెండోరోజు సెకండ్ లాంగ్వేజ్ పరీక్షను నిర్వహించామని ఎ కృష్ణారావు తెలిపారు. ఈ పరీక్షకు రెగ్యులర్ విద్యార్థులు 4,94,426 మంది దరఖాస్తు చేస్తే, 4,92,967 (99.70 శాతం) మంది పరీక్ష రాశారని పేర్కొన్నారు. 1,459 (0.30 శాతం) మంది గైర్హాజరయ్యారని వివరించారు. ప్రయివేటు విద్యార్థుల్లో 400 మంది దరఖాస్తు చేసుకుంటే, 214 (53.50 శాతం) పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. 186 (46.5 శాతం) మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. రెండోరోజు ఐదుగురు విద్యార్థులపై మాల్‌ప్రాక్టీస్ కేసులను నమోదు చేశారని వివరించారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఐదుగురు ఇన్విజిలేటర్లు, ముగ్గురు చీఫ్ సూపరింటెండెంట్లు (సీఎస్), ఇద్దరు డిపార్ట్‌మెంటల్ అధికారుల (డిఒ)ను విధుల నుంచి తొలగించామని తెలిపారు.

నెల రోజుల్లోనే ఎన్‌డిఎస్‌ఎ ప్రాథమిక నివేదిక ?

- మరోసారి డిజైన్, నిర్మాణాల పరిశీలన
- నేడు నిపుణుల కమిటీ రాక

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

జాతీయ డ్యామ్ భద్రతా సంస్థ (ఎన్‌డిఎస్‌ఎ) నియమించిన నిపుణుల కమిటీ కాళేశ్వరం ప్రాజెక్టు వైఫల్యంపై నెలరోజుల్లోనే ప్రాథమిక నివేదికను ఇచ్చే ప్రయత్నాల్లో ఉంది. ఈమేరకు అధ్యయనాన్ని వేగిరం చేసింది. పరిపాలన అంశాలతోపాటు నిర్మాణ విషయాలపై మరింత అవగాహన కోసం బుధ, గురువారాల్లో మరోసారి రాష్ట్రానికి రానుంది. హైదరాబాద్‌లోని జలసౌదతోపాటు కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల డిజైన్, నిర్మాణాలను మరోసారి పరిశీలించనుంది. రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు కేంద్ర జలశక్తి శాఖ పర్యవేక్షణలో చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలోని ఎన్‌డిఎస్‌ఎ నిపుణుల కమిటీని నియమించిన సంగతి తెలిసిందే. తొలిదశ పర్యటనలో అధికారులతో బేటి కావడంతోపాటు క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు ప్రణాళికలు, నిర్మాణం, ఇతర సాంకేతిక, బౌతిక అంశాలపై దృష్టిసారించింది. అధికారుల నుంచి 19 అంశాలపై సమాచారం కావాలని అడిగింది. తాజాగా ఈనెల 20, 21 తేదీల్లో పర్యటన సందర్భంగా డిజైన్లను ఇంకోసారి పరిశీలించాలని నిర్ణయించింది. అలాగే నిర్మాణాలనూ తనిఖీ చేయనుంది. ఈమేరకు రాష్ట్ర సాగునీటి శాఖకు ఎన్‌డిఎస్‌ఎ సభ్య కార్యదర్శి అమితాబ్ మీనా లేఖ రాశారు. ఇదిలావుండగా ప్రాజెక్టుల ప్రణాళిక, సాధారణ అంశాలు, డిపిఆర్ రూపకల్పన, హైడ్రాలజీ, పరిశోధన, సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్, నిర్మాణం, నాణ్యతా తనిఖీలు, అపరేషన్, నిర్వహణ తదితర అంశాలను మరోసారి అధ్యయనం చేయనుంది. ప్రాజెక్టు పనుల్లో భాగస్వాములైన ప్రతిఒక్కరూ పర్యటన సందర్భంగా అందుబాటులో ఉండాలని ఆదేశించింది. దీంతో ఎన్‌డిఎస్‌ఎ నిపుణుల బృందం రెండోసారి రాష్ట్రంలో పర్యటిస్తున్న నేపథ్యంలో సాగునీటి శాఖ అధికారుల్లో చర్చ ప్రారంభమైంది. ప్రాథమిక నివేదికను నెల రోజుల్లోనే ఇస్తామని ప్రభుత్వానికి ఇచ్చిన హామీని నిలబెట్టుకునే ప్రయత్నంలో ఎన్‌డిఎస్‌ఎ ఉన్నట్టు సమాచారం.



రోడ్డుపై బైఠాయించిన రైతులు

పంటనష్ట పరిహారం చెల్లించండి

- జాతీయ రహదారిపై రైతుల ధర్నా

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

పంట చేతికి వచ్చే సమయంలో అకాల వర్షంతో పూర్తిగా నష్టపోయామని, అధికారులు, ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం చెల్లించాలని రైతులు కోరారు. కామారెడ్డి జిల్లా భిక్కనూర్‌లోని జాతీయ రహదారి 44పై మంగళవారం రైతులు రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వడగండ్ల వానతో మండలంలోని ఆరు గ్రామాల్లో అన్ని పంటలకు 100 శాతం నష్టం ఏర్పడినట్టు వాపోయారు. ప్రజాప్రతినిధులు వచ్చి చూసి వెళ్లారే తప్పా.. పరిహారం ఎప్పుడు చెల్లిస్తారో తెలపలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మండల అధికారులకు వినతిపత్రం సమర్పించినా ఎలాంటి స్పందనా లేదన్నారు. పంట నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకొని ఎకరానికి 50వేల రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ, వ్యవసాయ అధికారులు వచ్చి తమ సమస్య పరిష్కరించే వరకు ధర్నా విరమించబోమని భీష్మించి కూర్చున్నారు. రెండు గంటలకు పైగా ధర్నా చేపట్టడంతో జాతీయ రహదారిపై ఇరు వైపులా వాహనాలు కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు, వ్యవసాయ, రెవెన్యూ అధికారులు ధర్నా ప్రాంతానికి చేరుకొని రైతులను నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. కలెక్టర్ వచ్చి నష్టపరిహారం అందేవిధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వాలని రైతులు స్పష్టంచేశారు. అనంతరం ఆర్డీవో శ్రీనివాస్ వచ్చి వ్యవసాయ అధికారులతో పంట నష్టపోయిన గ్రామాలను మరోసారి పరిశీలించి పూర్తి వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని చెప్పారు. ప్రస్తుతం రైతులు వినతిపత్రం అందజేస్తే జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అంతవరకు రైతులు అధికారులకు సహకరించాలని కోరడంతో ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో అంతంపల్లి, లక్ష్మీదేవిపల్లి, జంగంపల్లి, తిప్పాపూర్, రామేశ్వర పల్లి రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కాంగ్రెస్ వంద రోజుల పాలన అట్టర్ ఫ్లాప్

- మళ్లీ మేమే అధికారంలోకి వస్తాం..
- మాజీ మంత్రి ఎర్రబెల్లి
- పార్టీ మారడంలేదని స్పష్టీకరణ

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

అనేక అబద్ధపు హామీలు ఇచ్చి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ 100 రోజుల పాలన అట్టర్ ఫ్లాప్ అయిందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అధ్యక్షతన వర్ధన్నపేట నియోజకవర్గం విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ 100 రోజుల పాలనలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మరో ఆరు నెలల్లో కాంగ్రెస్ పార్టీ బండారం బయట పడుతుందని, ప్రజలు ప్రభుత్వంపై తీవ్ర అసహనంతో ఉన్నారని అన్నారు. తాను పార్టీ మారుతున్నట్టు వచ్చిన ప్రచారం అంతా అబద్ధమని, కెసిఆర్‌తోనే బిఆర్ఎస్ పార్టీలోనే ఉంటానని స్పష్టం చేశారు. బిఆర్ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందని, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కొందరు నేతలు కష్టకాలంలో పార్టీని వీడిపోవడం.. వారి స్వలాభం కోసమేనని, ఆస్తులు కాపాడుకోవడానికే విమర్శించారు. ఫోన్ టాంపరింగ్‌లో దోషిగా ఉన్న ప్రణీతరావు ఎవరో తనకు తెలియదన్నారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్యను కేసీఆర్‌తోపాటు అందరం కలిసి ఎంపిక చేశామని, విద్యావంతురాలైన ఆమెను అత్యంత మెజారిటీతో గెలిపించుకోవాలని కార్యకర్తలను కోరారు.

మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. బిఆర్ఎస్‌ను వీడిన ప్రతి ఒక్కరూ వ్యక్తులుగానే మిగిలిపోతారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి 420 హామీలు ఇచ్చిందని అమలు చేసే వరకు అందరం కలిసి పోరాడాలని పిలుపునిచ్చారు. తప్పుడు పని చేసినోళ్లు మాత్రమే పార్టీ మారుతున్నారని, నేతలు వెళికనా కార్యకర్తలు ఉన్నారని చెప్పారు. రేవంత్ రెడ్డి బ్లాక్ మెయిల్ రాజకీయాలు ఎక్కువ కాలం పని చేయవన్నారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య మాట్లాడుతూ.. తెలంగాణ హక్కుల కోసం పోరాడేది బీఆర్ఎస్ పార్టీ మాత్రమేనని చెప్పారు. కార్యకర్తలు మద్దతుతో నేనే గెలుస్తానని అన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ కూడా చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్, వాసుదేవా రెడ్డి, సదానందం, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

టికెట్ ఎందుకు ఆగిందో పార్టీ నేతలే చెప్పాలి

- బిజెపి నేత జలగం వెంకట్రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తనకు టికెట్ ఎందుకు ఆగిందనేది తాను చెప్పడం కాదు..పార్టీ నేతలే చెప్పాలని బిజెపి నేత, మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావు అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. తాను బిజెపి నేతలను మర్యాదపూర్వకంగా కలవడానికే వచ్చానని చెప్పారు. ప్రతి పార్టీకీ ఒక పద్ధతి ఉంటుందని, మొన్ననే పార్టీలో చేరిన తాను బిజెపి గురించి మాట్లాడటం సబబు కాదని అన్నారు. సరైన సమయంలో తనకు పార్టీ టికెట్ ప్రకటిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఖమ్మం సీటు టిడిపికి ఇస్తారనే చర్చ కేవలం మీడియాలోనే జరుగుతున్నదన్నారు. దానిపై తమ పార్టీలో ఎలాంటి చర్చా జరగలేదని స్పష్టం చేశారు.

డ్రగ్ స్మగ్లర్ స్టాన్లీ కేసులో మరొకరు అరెస్టు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అంతర్జాతీయ డ్రగ్ స్మగ్లర్ స్టాన్లీ కేసులో మరొకరిని పోలీసులు అరెస్ట్ చేశారు. స్టాన్లీ కోసం నెదర్లాండ్స్ నుంచి డ్రగ్స్ తెప్పిస్తున్న అంటోనియో ఒబింటా అలియాస్ ఓక్రాను పంజాగుట్ట పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం గోవాలోని కోల్వాలే జైలులో ఉన్న అతడిని పిటి వారెంట్‌పై హైదరాబాద్‌కు తీసుకొచ్చి నాంపల్లి కోర్టులో హాజరుపర్చారు. న్యాయస్థానం అతడికి 14 రోజులు రిమాండ్ విధించడంతో చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఓక్రాని విచారించాలని భావిస్తున్న పోలీసులు.. ఏడు రోజుల కస్టడీకి ఇవ్వాలని పిటిషన్ దాఖలు చేశారు. గతంలో డ్రగ్స్ కేసులో అరెస్టయిన ఓక్రా గోవా జైలులో ఉన్నాడు. జైలులో ఉన్నప్పటికీ స్మార్ట్‌ఫోన్ వినియోగిస్తూ డ్రగ్స్ దందాలు కొనసాగిస్తున్నాడు. స్టాన్లీ డ్రగ్స్ ఆర్డర్ ఇవ్వగానే.. నెదర్లాండ్స్‌లో ఉన్న వారికి ఫోన్ చేసి అక్కడి నైజీరియన్స్‌తో డ్రగ్స్‌ను భారత్‌కు తెప్పిస్తున్నాడు. అంతర్జాతీయ కొరియర్ సంస్థల ద్వారా దుస్తుల పెట్టెల్లో వచ్చే డ్రగ్స్‌ను పుణెలో సౌరభ్ అనే వ్యక్తి తీసుకుంటాడు. అక్కడి నుంచి వివిధ మార్గాల్లో స్టాన్లీకి చేరుతుంది. ఈ కేసులో స్టాన్లీ, సౌరభ్‌తోపాటు ఎస్ఆర్ నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రగ్స్ విక్రయిస్తూ పట్టుబడ్డ విశాల్, అతనికి గోవాలో విక్రయించిన దివాకర్ అలియాస్ బాబాలను పీటీ వారెంట్‌పై అరెస్ట్ చేశారు. తాజాగా ఓక్రానూ అదుపులోకి తీసుకున్నారు.

హైదరాబాద్‌లో విస్తృత తనిఖీలు

- మూడ్రోజుల్లోనే భారీగా పట్టుబడిన నగదు, విలువైన వస్తువులు
- ఒక్కరోజే రూ.16,43,300 పట్టివేత



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు గ్రేటర్ హైదరాబాద్‌లో ప్రత్యేక నిఘా ఉంచాయి. ఇందులో భాగంగా పోలీస్, ఎస్ఎస్‌టి, ఎఫ్ఎస్‌టి టీమ్‌లు క్షేత్ర స్థాయిలో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నాయి. నగరంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 24 గంటలపాటు తొమ్మిది టీంలు పనిచేస్తున్నాయి. ఈ క్రమంలో మూడ్రోజుల్లోనే రూ.35 లక్షలకుపైగా స్వాధీనం చేసుకున్న ఈ బృందాలు, విలువైన వస్తువులను సీజ్ చేశాయి. మంగళవారం ఒక్కరోజే రూ.16,43,300తో పాటు రూ.10,250 విలువగల వస్తువులను సీజ్ చేశారు. హైదరాబాద్ జిల్లాలో ఎఫ్ఎస్‌టి (ఫ్లయింగ్ స్క్వాడ్) బృందాలు రూ.9,30,000 సీజ్ చేయగా, పోలీసులు మరో రూ.7,13,300ను పట్టుకున్నారు. ఇప్పటి వరకు మొత్తం రూ.17,25,311 విలువగల వస్తువులను పట్టుకున్నారు. 54.67 లీటర్ల అక్రమ మద్యాన్ని పట్టుకుని.. ఎనిమిది మందిని ప్రోహిబిషన్ కేసుల్లో అరెస్టు చేశారు. మంగళవారం నగదు, ఇతర వస్తువులపై ఐదు ఫిర్యాదులు రాగా.. పరిశీలించి పరిష్కరించారు. ఇప్పటి వరకు రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు.

ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే ఫిర్యాదు చేయాలి
హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి

పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో పూర్తిచేస్తామని, ముఖ్యంగా నగదు తరలింపుపై ప్రత్యేక దృష్టి సారించినట్టు హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్ తెలిపారు. నగదు పంపిణీని అరికట్టేందుకు విస్తృత తనిఖీలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎవరైనా ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘిస్తే ఫిర్యాదు చేయాలని కోరారు. ఉల్లంఘనపై 1950 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా, లేదా సీ-విజిల్ యాప్ ద్వారా, టోల్ ఫ్రీ నెంబర్ 1800-599-2999కు ఫిర్యాదు చేయొచ్చన్నారు. 24 గంటలపాటు పని చేస్తాయని వివరించారు.

ఆర్‌పిఎఫ్ ఎస్‌ఐగా చెలామణి

- పెళ్లి చూపుల్లో బయటపడ్డ మోసం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



రైల్వే పోలీసు కావాలన్నది ఆమె ఆకాంక్ష.. అందుకోసం 2018లో జరిగిన ఆర్పీఎఫ్ ఎస్సై పరీక్ష రాసింది. కంటి చూపు సరిగా లేకపోవడం ఆమె పాలిట శాపంగా మారింది. ఎలాగైనా తన తల్లిదండ్రులు, గ్రామస్థులను సంతృప్తి పరచడానికి పోలీసు అధికారిగా ప్రజల్లో చలామణి కావాలని నిర్ణయించుకుని ఆర్పీఎఫ్ ఎస్ఐ అవతారమెత్తింది. విధులకు వెళ్తున్నట్టు దాదాపు ఏడాది పాటు కుటుంబ సభ్యులు, గ్రామస్థులను నమ్మించింది. పెళ్లి చూపులకు కూడా అదే యూనిఫాంలో వెళ్లి కటకటాల పాలైంది. కేసు వివరాలను రైల్వే ఎస్పీ సలీమా మంగళవారం మీడియాకు వెల్లడించారు. నార్కట్‌పల్లికి చెందిన మాళవిక హైదరాబాద్‌లోని నిజాం కళాశాలలో డిగ్రీ పూర్తి చేసి ఆర్పీఎఫ్ ఎస్సై పరీక్షకు హాజరైంది. కంటి చూపు సరిగాలేక అర్హత సాధించలేకపోయింది. ఎలాగైనా తన తల్లితండ్రులు, గ్రామస్థుల ముందు పోలీస్‌గా చలామణి అవ్వాలని నిర్ణయించుకుంది. ఎల్బీ నగర్ ప్రాంతంలో ఆర్పీఎఫ్ పోలీసులు ధరించే యూనిఫాం కొనుగోలు చేసింది. రైల్వే ఎస్సైగా నల్గొండలో విధులు నిర్వహిస్తున్నట్లు దాదాపు ఏడాది పాటు ప్రజలను నమ్మించి మోసాలకు పాల్పడింది. దేవాలయాలకు వెళ్లి, ప్రముఖులను కలిసి ఫోటోలు దిగి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేసేది. చివరికి పెళ్లి చూపులకు కూడా అదే యూనిఫాంలో వెళ్లింది. అబ్బాయి తరపు బంధువులు ఆర్పీఎఫ్‌లో పై అధికారులను ఆరా తీయగా ఆమె అసలు గుట్టు బయటపడింది. వెంటనే అప్రమత్తమైన నల్గొండ ఆర్పీఎఫ్ సిబ్బంది మాళవికను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా ఆమె మోసాల చిట్టా బయటపడింది. వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, విచారణలో మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని ఎస్పీ తెలిపారు.

కెసిఆర్‌ను దెబ్బతీసేందుకే కవిత అరెస్ట్

- మాజీ మంత్రి సత్యవతి రాథోడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



బిఆర్ఎస్ అధినేత కెసిఆర్‌ను రాజకీయంగా దెబ్బతీసేందుకే బిజెపి సర్కార్ ఎమ్మెల్సీ కవితను అరెస్ట్ చేయించిందని

మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ విమర్శించారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీత, హరిప్రియ నాయక్‌తో కలిసి ఆమె మాట్లాడారు. మద్యం పాలసీ కేసులో అసెంబ్లీ ఎన్నికల ముందు సాక్షిగా ఉన్న కవితను పార్లమెంటు ఎన్నికలకు ముందు నిందితురాలిగా మార్చడం రాజకీయ కుట్రలో భాగమేనని ఆరోపించారు. దేశంలోని అనేక రాష్ట్రాలు మద్యం పాలసీలను మార్చాయని గుర్తు చేశారు. పాలసీలను మార్చడం ఆ రాష్ట్రం యొక్క అవసరాలు, పరిస్థితులను బట్టి మాత్రమే ఉంటుందన్నారు. విదేశాల నుంచి బొగ్గు దిగుమతి చేసుకునే పాలసీని తెచ్చిన నరేంద్రమోడీ డబ్బులు తీసుకొని తెచ్చారా? అంటూ ప్రశ్నించారు. దర్యాప్తు సంస్థలను బిజెపి పక్క దారి పట్టిస్తోందనీ, ఆ పార్టీకి వ్యతిరేకంగా ఉన్న వారిపై వాటిని ప్రయోగిస్తున్నారని విమర్శలు గుప్పించారు. అప్పటి వరకు నిందితులుగా ఉన్న వారు కాషాయం కండువా కప్పుకుటే పునీతులవుతున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కేసీఆర్‌ను, డిల్లీలో కేజ్రీవాల్‌ను ఎదుర్కోలేక కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలే బిజెపికి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.



ఎర్త్ అవర్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వాణీ ప్రసాద్

మార్చి 23న ఎర్త్ అవర్

- ఆ రోజు రాత్రి 8.30 నుంచి 9.30 వరకు లైట్లు బంద్ చేయాలి : వాణీ ప్రసాద్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎర్త్ అవర్‌లో భాగంగా ఈ నెల 23న దేశవ్యాప్తంగా రాత్రి 8:30 నుంచి 9:30 మధ్యలో గంట పాటు లైట్లు ఆఫ్ చేయాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ ముఖ్యకార్యదర్శి వాణీ ప్రసాద్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఎర్త్ అవర్ పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎర్త్ అవర్ అనేది గ్రహం ఎదుర్కొంటున్న ట్రిపుల్ సంక్షోభాన్ని గుర్తించడానికి, వాతావరణ మార్పులు, జీవ-వైవిధ్య నష్టం, పర్యావరణం రక్షించడానికి దేశవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ సంస్థలు, స్విచ్ ఆఫ్ పవర్ ద్వారా ఎర్త్ అవర్ పాటించాలని ప్రజలను కోరారు. ఈ ఉద్యమం వ్యక్తులు, సంస్థలు, వివిధ సంఘాలు అనవసరమైన లైట్లను ఒక గంట పాటు ఆఫ్ చేయాలని ఈ కార్యక్రమాన్ని నిర్దేశించారు. 23న సచివాలయం, అంబేద్కర్ విగ్రహం, ట్యాంక్‌బండ్‌లోని బుద్ధవిగ్రహం, దుర్గం చెరువు, గోల్కొండ కోట, చార్మినార్, రాష్ట్ర గ్రంథాలయం, రాష్ట్రంలోని ఇతర స్మారక చిహ్నాలన్నింటిలోనూ లైట్లు ఆర్పాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.


చెత్త తొలగింపుతో క్లీన్‌గా ఉన్న రోడ్డు

చెత్త, చెదారం తొలగింపు

- అధికారులతో జిహెచ్ఎంసి కమిషనర్ సమీక్ష

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మీడియాలో వచ్చిన కథనాలకు జిహెచ్ఎంసి అధికారులు స్పందించారు. ఈ మేరకు నగరంలోని పలు ప్రాంతాల్లో చెత్తచెదారాన్ని తొలగించారు. తెలుగు తల్లి ఫ్లైఓవర్ సమీపంలోని చెత్తతోపాటు పలు ప్రాంతాల్లో చెత్తను తొలిగించారు. మంగళవారం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో జోనల్ కమిషనర్లు, హెల్త్ అండ్ శానిటేషన్ విభాగం అధికారులతో పారిశుధ్య నిర్వహణపై జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్ సమావేశం నిర్వహించారు. నగరంలో సి అండ్ డి వేస్టేజ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని ఏఎంహెచ్ఓలను కమిషనర్ ఆదేశించారు. ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ సిస్టం, స్ట్రీట్ స్వీపింగ్ మిషన్స్ పర్య వేక్షణ, జివిపిల తొలగింపు, సి అండ్ డి వేస్టేజ్ తదితర అంశాలపై చర్చించి పలు సూచనలు చేశారు. పలు ప్రాంతాలలో నిర్మాణాలు చేపడుతున్న వారు నిర్మాణ సామాగ్రిని రోడ్డుపైనే వేస్తున్నారని, అలాంటి వారికి జరిమానా విధిం చాలన్నారు. అలాగే రోడ్లపై చెత్త వేయకుండా బోర్డులు ఏర్పాటు చేయాలని చెప్పారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

మాజీ మంత్రి హరీశ్ రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులను తక్షణమే ఆదుకోవాలని బిఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. గత మూడురోజులుగా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఈదురుగాలులు, వడగళ్ల వాన కురుస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించలేదని ఆరోపించారు. కాంగ్రెస్ సర్కారుకు కేవలం రాజకీయాలే తప్ప రైతుల సమస్యలు పట్టడం లేదన్నారు. ఈ మేరకు ఎక్స్ (ట్విటర్)లో సోమవారం ఆయన పోస్టు చేశారు.

"గతంలో అకాల వర్షాలకు రైతులు నష్టపోతే అప్పటి సీఎం కేసీఆర్ ఎకరాకు రూ.10వేల నష్టపరిహారం ఇచ్చారు. వడగళ్ల వానతో ఆదిలాబాద్, నిజామాబాద్, కామారెడ్డి, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, మెదక్, సిద్దిపేట, రంగారెడ్డి తదితర జిల్లాల్లో పంట నష్టం అంచనా వేయాలి. వర్షంతో వరి, మొక్కజొన్నతో పాటు మామిడి సహా మరికొన్ని ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం కలిగింది. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం ప్రకటించాలి. ఎకరాకు రూ.10వేలు ఇవ్వాలి" అని డిమాండ్ చేశారు.

రిజర్వేషన్ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి

దళిత క్రైస్తవుల ఎస్‌సి రిజర్వేషన్ సాధన సమితి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దళిత క్రైస్తవుల ఎస్‌సి రిజర్వేషన్ బిల్లుకు చట్టబద్ధత కల్పించే పార్టీని బలపరుస్తామని దళిత క్రైస్తవుల ఎస్‌సి రిజర్వేషన్ సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు నాగళ్ల పోచయ్య ఇజ్రాయేల్ తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో సమితి రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో ఎవరికి మద్దతివ్వాలనే అంశంపై నాయకులు చర్చించారు. ఈ సందర్భంగా ఇజ్రాయేల్ మాట్లాడుతూ.. ఎస్‌సి రిజర్వేషన్ల కోసం దళిత క్రైస్తవులు 50 ఏండ్లకు పైగా పోరాడుతున్నారని గుర్తుచేశారు. ఈ అంశంపై వివిధ పార్టీలు అనుసరిస్తున్న వైఖరిపై లోతుగా చర్చించినట్టు తెలిపారు. తమను దూరంగా ఉంచిన పార్టీలను తాము కూడా పార్లమెంటు ఎన్నికల్లో దూరంగా పెట్టి బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సమితి యూత్ అధ్యక్షులుగా పల్లె జోసఫ్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. జాన్సన్, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

రూ. రెండు లక్షల రైతు రుణమాఫీ ఎలా చేస్తావ్..?

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రేవంత్‌రెడ్డి రూ. రెండు లక్షల రుణమాఫీ ఎలా చేస్తారని ఈటల రాజేందర్ ప్రశ్నించారు. మద్యం అమ్మితే తప్ప ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలు ఇచ్చే పరిస్థితి లేదని, ఇచ్చిన హామీలను ఎలా నెరవేరుస్తారని ప్రశ్నించారు. ప్రత్యేక రాష్ట్రం వచ్చినప్పుడు రూ.10,700 కోట్ల ఆదాయం మద్యం మీద ఉంటే, ఇప్పుడు రూ.45 వేల కోట్లకు పెరిగిందన్నారు. రూ.7,600 కోట్లకు రింగ్ రోడ్డును తాకట్టు పెట్టి, హైటెక్ సిటీ పక్కనున్న భూములు అమ్మినా కెసిఆర్ రూ.లక్ష రుణమాఫీ చేయలేపోయారని, అప్పుల ఊబిలో కొట్టుమిట్టాడుతున్న ప్రస్తుత సమయంలో రూ.రెండు లక్షల రుణమాఫీ ఎలా చేస్తారని ప్రశ్నించారు.కెసిఆర్ తుగ్లక్ లాగా వ్యవహరించారు తప్ప.. నిజంగా రైతు బాగు కోసం ఏనాడూ పని చేయలేదన్నారు. కళ్లముందు నిజాన్ని కూడా అదరగొట్టి బతికిన వ్యక్తి కెసిఆర్ అన్నారు.

కార్మిక పాలసీ రూపొందించాలి

- సిఎం రేవంత్‌రెడ్డికి సిఐటియు లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజాపాలనలో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, సంక్షేమం కోసం ప్రత్యేకంగా కార్మిక పాలసీ రూపొందించాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్కరాములు, పాలడుగు భాస్కర డిమాండ్ చేశారు. కార్మికుల న్యాయమైన కోర్కెలను రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతతో పరిశీలించాలని, కార్మిక సంఘాలతో చర్చలు జరిపి సానుకూలంగా పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు మంగళవారం వారు సిఎం రేవంత్‌రెడ్డికి వారు బహిరంగ లేఖ రాశారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు కార్మికరంగంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. రాష్ట్రంలో ఉత్పత్తిని పెంచి సంపదను సృష్టిస్తున్న కోటి మందికిపైగా కార్మికుల శ్రమను గుర్తించాలని, వారికి మెరుగైన ప్రతిఫలం దక్కేలా వాస్తవ దృష్టితో పరిశీలించాలని విన్నవించారు. 'ప్రభుత్వ అధినేతగా ఫిక్కీ, చాంబర్ ఆఫ్ కామర్స్ వంటి యాజమాన్య సంస్థల సమావేశాలకు సీఎం హాజరవుతున్నారు. వారితో చర్చలు జరుపుతున్నారు. వ్యాపార-వాణిజ్య సంస్థలకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తామని ప్రకటించారు. దావోస్‌లో పెట్టుబడిదారులకు రాయితీలిస్తాం...అటంకాల్లేకుండా రాష్ట్రంలో పరిశ్రమలు పెట్టొచ్చని హామీనిచ్చారు. కానీ శ్రామికుల జీవన ప్రమాణాలకు రాష్ట్ర ప్రభుత్వం గ్యారంటీ ఇస్తుందని ప్రకటించకపోవడం సమంజసంగా లేదు' అని పేర్కొన్నారు. 73 రంగాలకు కొత్త జిఒల వల్ల కార్మికులకు పెరిగిన వేతనం శూన్యమని తెలిపారు. ప్రస్తుతం పొందే వేతనానికి కొత్త డిఎ పాయింట్లు కలిపి వదిలేశారని విమర్శించారు. కార్మికుల ఆకాంక్షలకు అనుగుణంగా నూతన ప్రభుత్వం పనిచేయాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో సంపద సృష్టికర్తలైన కోటి మందికిపైగా కార్మికులు, వారికి నాయకత్వం వహిస్తున్న కార్మిక సంఘాలు, ప్రజా సంఘాల నాయకులకు సమస్యలపై చర్చించడానికి అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం మాదిరిగా సమ్మెలు, ఉద్యమాలు, పోరాటాలను అణిచివేయొద్దని, కార్మికశాఖను నిస్తేజం చేయొద్దని హితవు పలికారు.

సిఎం రేవంత్‌రెడ్డి మేడిగడ్డ సందర్శన, రాష్ట్రంలో ప్రధాని మోడీ పర్యటనల సందర్భంగా సిఐటియు నాయకులు, కార్మికులను ఎక్కడికక్కడ ముందస్తు అరెస్టులు చేయడాన్ని తప్పుబట్టారు. రాష్ట్రంలో బిజెపికి బిఆర్ఎస్ బి టీమ్ అంటూ కాంగ్రెస్, బిజెపి, కాంగ్రెస్ ఒక్కటే అంటూ బిఆర్ఎస్ విమర్శలు చేసుకోవడం తగదని హితవు పలికారు. దేశంలో మోడీ సర్కారు అవినీతి, కార్పొరేట్ విధానాలు అనుసరిస్తూ ప్రజల ఐక్యతను విఘాతం కలిగిస్తున్నదని తెలిపారు. మౌలిక సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు రాముడు, హిందుత్వ భావోద్వేగాలతో రాజకీయం చేస్తోందని విమర్శించారు. లౌకి, రాజ్యాంగ స్ఫూర్తికి బిజెపి విఘాతం కలిస్తున్న ఈ క్లిష్టపరిస్థితుల్లో కాంగ్రెస్, బిఆర్ఎస్ కలిసికట్టు కేంద్రంపై పోరాడాలని పిలుపునిచ్చారు.

దండుమైలారంలో దారుణ ఘటన

- తల్లి నెట్టడంతో గోడకు తగిలి కుమార్తె మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని దండుమైలారంలో ఓ యువతి అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. అయితే, హత్యకు గురైందని.. అందుకు ప్రేమ వ్యవహారమే కారణమని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అందుకు సంబంధించి మృతురాలి సోదరుడు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..దండుమైలారం గ్రామానికి చెందిన మోతే జంగమ్మ- ఐలయ్య దంపతులకు ముగ్గురు పిల్లలు. పెద్ద కుమార్తె మోతే భార్గవి (19) నగరంలోని అనిబీసెంట్ మహిళా డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతోంది. ఆమెకు మేనబావతో వివాహం చేసేందుకు కుటుంబ సభ్యులు నిర్ణయించారు. అయితే, భార్గవి అదే గ్రామానికి చెందిన మరో యువకుడిని ప్రేమించింది. ఆ యువకుడు సోమవారం భార్గవి ఇంటి వాచ్చాడు. అదే సమయంలో ఇంటికి వచ్చిన యువతి తల్లి మందలించడంతో వెళ్లిపోయాడు. కుమార్తెను కూడా తిట్టింది. తల్లీకూతురి మధ్య వాగ్వాదం జరిగింది. ఆ సమయంలో భార్గవి సోదరుడు భయంతో బయటకు వెళ్లిపోయాడు. ఈ క్రమంలో తల్లి భార్గవిని నెట్టడంతో తల గోడకు తగిలింది. దాంతో అక్కడికక్కడే భార్గవి మృతిచెందింది. అయితే, ఉరేసుకుని చనిపోయినట్టుగా నమ్మించే ప్రయత్నం చేశారు. అనంతరం మృతురాలి సోదరుడు చరణ్ ఇబ్రహీంపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహంపై గాయాలను గుర్తించారు. అనంతరం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కానీ, భార్గవిని ప్రేమించిన యువకుడే హత్య చేసి పారిపోయాడని తల్లి ఆరోపిస్తోంది. మహేశ్వరం డిసిపి సునీతారెడ్డి ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేపట్టినట్టు ఇబ్రహీంపట్నం ఎసిపి కెపివి రాజు తెలిపారు.

హేయమైన చర్య : సిపిఎం

ప్రేమ వ్యవహారం తెలిసి కన్న తల్లే కుమార్తెను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించడం హేయమైన చర్యని సిపిఎం ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి సిహెచ్ జంగయ్య, నాయకులు ఎ.వెంకటేష్ అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటి ప్రేమ హత్యలు కొనసాగడం ఆందోళన కలిగిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. హత్యకు గల కారణాలను వెలికి తీసి దోషులను శిక్షించాలని పోలీసులను కోరారు.

కార్మిక, రైతాంగ సమస్యలే ఎన్నికల ఎజెండా

- 73 షెడ్యూల్ ఎంప్లాయిమెంట్స్‌లో కనీస వేతనాలు కరువు
- 1500 పరిశ్రమల్లో 2.50 లక్షల మంది కార్మికులు
- లేబర్ కోడ్‌లు తెచ్చిన మోడీ పట్ల తీవ్ర వ్యతిరేకత
- పంటలకు దక్కని కనీస మద్దతు ధరలు
- మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలో ప్రభావం చూపుతున్న సమస్యలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ రాబోతుంది. ఇప్పటికే ఆయా రాజకీయ పార్టీలు అభ్యర్థులను ఖరారు చేసే పనిలో బిజీబిజీగా ఉన్నాయి. మెతుకు సీమగా పేరొందిన మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలో బిజెపి, బిఆర్ఎస్, కాంగ్రెస్ పోటీ చేయనున్నాయి. రెండు దశాబ్దాలుగా మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలో జాతీయ పార్టీల అభ్యర్థులు గెలవలేకపోయారు. బీఆర్ఎస్ వరుసగా ఐదు పర్యాయాలు గెలుస్తూ వచ్చింది. ఈ సారి ఎన్నికల్లో ఎలాగైనా బిఆర్ఎస్‌ను ఓడించి గెల్చి తీరాలన్న పట్టుదలతో కాంగ్రెస్, బిజెపిలున్నాయి. పార్టీల బలాబలాల పరిస్థితి పక్కన పెబడితే.. పారిశ్రామిక, వ్యవసాయక ప్రాంతంగా ఉన్న మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలో కార్మిక, రైతాంగ సమస్యలే ఎన్నికల్లో తీవ్ర ప్రభావం చూపనున్నాయి. నియోజకవర్గం పరిధిలో ఉన్న వేలాది పరిశ్రమల్లో లక్షలాది మంది కార్మికులున్నారు. వీరికి సంబంధించి షెడ్యూల్ పరిశ్రమల్లో కనీస వేతనాల సవరణ జరగట్లేదు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాల్ని రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తేనుంది. బీడీ కార్మికుల సమస్యలూ ఉన్నాయి. వీటిపైనా కార్మిక వర్గం తీవ్ర ఆగ్రహంతో ఉంది. అదే విధంగా పంటలకు కనీస మద్దతు ధర లేకపోవడం, కేంద్రం నల్ల చట్టాల్ని తెచ్చి వ్యవసాయాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టాలని చేస్తున్న నిర్ణయాల ప్రభావం కూడా తీవ్రంగా ఉండనుంది.

మెదక్ పార్లమెంట్ నియోజకవర్గానికి ఎంతో ప్రత్యేకత ఉంది. 18.12 లక్షల మంది ఓట్లున్నారు. వీరిలో కార్మికులు, రైతులే పది లక్షల వరకు ఉన్నారు. పటాన్‌చెరు, సంగారెడ్డి, నర్సాపూర్, మెదక్, గజ్వేల్, సిద్దిపేట అసెంబ్లీ నియోకజవర్గాల్లో భారీ, మధ్యతరహా పరిశ్రమలు విస్తరించి ఉన్నాయి. దుబ్బాక, మెదక్ నియోజకవర్గాల్లో బీడీ పరిశ్రమ విస్తరించింది. అదే విధంగా మెదక్, నర్సాపూర్, సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక వంటి అసెంబ్లీ నియోజకవర్గాల్లో వ్యవసాయమే ప్రధాన జీవనాధారంగా ఉంది. కాళేశ్వరం, సింగూరు జలాల వినియోగంతో పటాన్‌చెరు మినహా అన్ని నియోజకవర్గాల్లోనూ వరి, పత్తి, చెరకు, మామిడి వంటి పంటలు 10 లక్షల ఎకరాల్లో పండుతున్న పరిస్థితి ఉంది. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం ఏర్పడాలనే విషయాలపై అసెంబ్లీ ఎన్నికలు నిర్ణయించినా.. పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్ల ఆలోచన వేరుగా ఉండనుంది. కేంద్రంలో ఏ పార్టీ అధికారంలోకి వస్తే తమకు మేలు చేకూరుతుందనే విషయాల్ని ఓటర్లు ఆలోచించే అవకాశముంది. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ ఇంత కాలం తీసుకున్న నిర్ణయాలు మేలు చేశాయా.. కీడు చేశాయా..? అనే అంశాలను కూడా ఓటరు పరిశీలన చేసే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు బావిస్తున్నారు.

73 షెడ్యూల్ ఎంప్లాయిమెంట్స్‌లో కనీస వేతనాలు.. నాలుగు లేబర్ కోడ్స్

పటాన్‌చెరు మినీ ఇండియాగా మారింది. పటాన్‌చెరు నియోజకవర్గంలోని పాశమైలారం, పటాన్‌చెరు, బొల్లారం, గడ్డపోతారం, బొంతపల్లి, ఆర్‌సీపురం ప్రాంతంలోనే 1300 పరిశ్రమలున్నాయి. సంగారెడ్డి, నర్సాపూర్, మెదక్, గజ్వేల్, సిద్దిపేట అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ వందలాది పరిశ్రమలున్నాయి. 73 షెడ్యూల్ పరిశ్రమల్లో కనీస వేతనాలను సవరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ప్రాథమిక నోటిఫికేషన్ ఎన్నికల వేళ చర్చనీయాంశమైంది. 2 నెలల గడువిచ్చి అభ్యంతరాలను కోరింది. ప్రిన్సిపల్ అడ్వైజరీ ప్లానింగ్ కమిషన్ స్టాండింగ్ కమిటీ ఇచ్చిన రికమండేషన్స్, కనీస వేతనాల సలహా మండలి సూచనలు, పెరుగుతున్న ధరలను రాష్ట్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదని కార్మిక వర్గం అభిప్రాయపడుతోంది. ఇప్పటికే అమల్లో ఉన్న పాత జీవోల వేతనాలకు కొత్తగా ప్రతిపాదించిన వేతనాలకు ఒక్క రూపాయి కూడా పెరకపోగా కొన్ని షెడ్యూల్ ఎంప్లాయిమెంట్స్‌లో వేతనాలు తగ్గుతున్నాయని కార్మికులు ఆవేదన వ్యకం చేస్తున్నారు.

పెరిగిన ధరలు, సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా కనీస వేతనాలను నిర్ణయించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. మరో పక్క కార్మికులు పోరాడి సాధించుకున్న అనేక చట్టాలను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చేందుకు పూనుకుంది. లేబర్ కోడ్‌లు అమల్లోకి వస్తే మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఉన్న రెండున్నర లక్షల మంది కార్మికులు రోడ్డున పడనున్నారు. యాజమాన్యాలకు అనుకూలంగా లేబర్ కోడ్‌లు తెచ్చి కార్మికుల పొట్టగొట్టాలని చూస్తున్న బిజెపికి ఎందుకు ఓటు వేయాలనే ప్రశ్న కార్మికుల్లో వ్యక్తమవుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రెండు కూడా కార్మిక వర్గానికి వ్యతిరేకంగా వ్యవహారిస్తున్నాయనే చర్చ ఉంది. దుబ్బాక, మెదక్, సిద్దిపేట ప్రాంతాల్లో 30 వేల మంది బీడీ కార్మికులున్నారు. వీరంతా శ్రమ దోపిడికి గురవుతున్నారు.

నల్ల చట్టాల ప్రభావం

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తేవాలనుకుంటున్న నల్ల చట్టాల ప్రభావమూ ఈ నియోజకవర్గంలో ఉంది. రైతులు పండించిన పంటలకు కనీస మద్ధతు ధర రావట్లేదు. ప్రాజెక్టుల నిర్మాణం, ఉచిత కరెంట్, రైతు భరోసాతో పంటల సాగు విస్తీర్ణం రెండింతలైంది. పది లక్షల ఎకరాల్లో పత్తి, వరి ఇతర పంటలు సాగవుతున్నాయి. వరికి మద్ధతు ధర, బోనస్ దక్కట్లేదు. ఎఫ్‌సిఐ ద్వారా బియ్యం సేకరణ జరిగే ప్రక్రియను కేంద్రం ఆపేసింది. దాంతో ధాన్యం రైతులకు ధర రాకుండా పోయింది. సిద్దిపేట జిల్లాలో 3.50 లక్షల ఎకరాల్లో పత్తి సాగైతే సిసిఐ చేతులెత్తేసి వ్యాపారుల లాభాల కోసం ఏజెంట్‌గా పనిచేసింది. 15 వేల ఎకరాల్లో చెరకు సాగుతున్నా కేంద్రం గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో చెరకు రైతులు నష్టాల పాలయ్యారు. సన్న, చిన్నకారు రైతుల్ని వ్యవసాయానికి దూరం చేసి కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు నల్ల చట్టాలు చేస్తున్నారని బిజెపి ప్రభుత్వాన్ని రైతులు విమర్శిస్తున్నారు.

రైల్వే లైన్లు, విద్యా సంస్థల సమస్యలు

మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో కేంద్రీయ విద్యాలయాల్ని ఏర్పాటు చేయాలని ఎప్పటి నుంచో పోట్లాడుతున్నా పదేండ్ల పాలనలో మోడీ ఒక్క పాఠశాలనూ మంజూరు చేయలేదు. గత ప్రభుత్వం మూడు ప్రభుత్వ మెడికల్ కళాశాల్ని నెలకొల్పినప్పటికీ కేంద్రం ఎలాంటి సాయమూ చేయలేదు. అదే విధంగా కొత్త రైల్వే లైన్ల నిర్మాణం, డబుల్ లైన్ల విస్తరణకు సంబంధించిన ప్రతిపాదనలు పెండింగ్‌లోనే ఉన్నాయి. గతంలో బీఆర్ఎస్ తరపున గెలిచిన ప్రస్తుత దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి రైల్వేకు సంబంధించి కొన్ని పనులు పూర్తి చేసినట్టు తెలిపారు.